క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే, కలెక్టర్ రాక

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో శుక్రవారం ఎమ్మెల్యే సునితారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యటించనున్నట్లు తహసీల్దార్ బాలలక్ష్మీ పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రైతువేదికలో నిర్వహించే కార్యక్రమంలో వారు పాల్గొని నూతన్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తారని తెలిపారు.

స్థల పరిశీలన



అంబేద్కర్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ఔరంగాబాద్ శివారులో 406 సర్వే నంబర్‌లో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని మెదక్ ఆర్డీఓ రమాదేవి గురువారం పరిశీలించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశాల మేరకు దళిత సంఘ నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించినట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నా యకులు బాల్‌రాజ్, యాదగిరి, మురళి, సామేల్, సంజీవ్, దయాసాగర్, ఇసాక్ తది తరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



స్టోర్ గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ

రేగోడ్(మెదక్): కేజీబీవీ బాలికల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎంఈఓ గురునాథ్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వయంప్రభను ఆదేశించారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని ప్రాథమిక పాఠశాల, కేజీబీవీలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలో తాగునీరు, స్టోర్ గది, పరిసరాలను పరిశీలించారు. నీటి సౌకర్యం ఉన్నా నీరు సరిపడక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎంఈఓ దృష్టికి రావడంతో.. సమస్యను స్వయంగా తెలుసుకున్నారు.

క్రీడా దుస్తులు అందజేత



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ మధుమోహన్

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు క్రీడా దుస్తులను ఎంఈఓ అందజేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కరుణాకర్, మాధవి, సీఆర్‌పీ మల్లేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

నర్సాపూర్ రూరల్: జీవామృతం తయారీపై రైతులకు అవగాహన అవసరమని తునికీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని రామచంద్రాపూర్‌లో మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులతో కలసి జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. అలాగే విత్తనశుద్ధితో కలిగే ప్రయోజనాలను వివరించారు.

స్లీపర్ల తయారీ పరిశీలన



స్లీపర్లను పరిశీలిస్తున్న నవీన్‌గులాటీ

చేగుంట(తూప్రాన్): స్థానిక పాటిల్ రైల్వే స్లీపర్ల పరిశ్రమను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రైల్వే బోర్డు మెంబర్ నవీన్ గులాటీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో జర్మన్ టెక్నాలజీతో తయారు చేస్తున్న పట్టాల స్లీపర్లను, వాటి నాణ్యతను పరిశీలిచారు. ఈ సందర్భంగా పలు అంశాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. నూతన టెక్నాలజీతో చేస్తున్న స్లీపర్లు నాణ్యతతో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం పరిశ్రమలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

బడి, గుడిలోకి ఎవరైనా వెళ్లొచ్చు

చిన్నశంకరంపేట(మెదక్): బడి, గుడిలోకి వరైనా వెళ్లొచ్చని ఎలాంటి అసమానతలు చూపవద్దని నార్సింగి తహసీల్దార్ షేక్ కరీం అన్నారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో పౌరహక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి కుల వివక్ష ఉండకూడదన్నారు. అందరూ సమానమేనని, కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, ఈఓ నాగభూషనం ఉన్నారు.

మిర్జాపల్లిలో...

చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలో గురువారం ఆర్ఐ పడాల రాజు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ విఠల్, గ్రామ కార్యదర్శి నర్సింహులు, గ్రామ ప్రత్యేక అధికారి తులసీరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌరహక్కులపై ఆవగాహన కల్పించారు.



నార్సింగిలో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రవిరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఎంఈఓ తారాసింగ్

నర్సాపూర్ రూరల్: ఉపాధ్యాయుడు రవిరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ తారాసింగ్ ప్రభుత్వ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని అద్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం రవిరాజ్ తన సొంత నిధుల రూ.లక్షతో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు, టైప్ బెల్టులు పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. హెచ్‌ఎం రవిరాజ్ వినూత్న పద్ధతిలో విద్యార్థులకు పాఠాలు బోధించడంతోపాటు యూట్యూబ్ ద్వారా పాఠాలు అర్థమయ్యే రీతిలో బోధిస్తూ రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. ఓ వైపు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ సొంత సొంత నిధులతో స్పోర్ట్స్ డ్రెస్‌లు, టై, బెల్టులు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద పిల్లల కోసం ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు వ్యక్తిగత శ్రద్ధతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు తిరుపతిరావు, గోపి, అనిత విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, టై బెల్టులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ తారాసింగ్

రాజాగౌడ్ సేవలు చిరస్మరణీయం



మాజీ సర్పంచ్ రాజాగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణారెడ్డి తదితరులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి గ్రామ అభివృద్ధికి మాజీ సర్పంచ్ గౌడ రాజాగౌడ్ అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మండల కేంద్రంలో గురువారం జరిగిన రాజాగౌడ్ సంతాపసభలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ...నార్సింగి సర్పంచ్‌గా పదేళ్ల పాటు పనిచేసిన ఆయన అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. పేదలకు అందుబాటులో ఉండి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశంగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మైలారం బాబు, భూపతిరాజు, నాయకులు సిద్దాగౌడ్ ఉన్నారు.

9 మందిపై కేసు నమోదు

మెదక్ మున్సిపాలిటీ: రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మహేశ్ తెలిపారు. గురువారం పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న 9 మందిని పట్టుకొని వాహనాలు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ మహేష్

ఉపాధ్యాయురాలి డిప్యుటేషన్ రద్దు చేయాలి



చిన్నశంకరంపేట ఎంఈఓ పుష్పవేణికి వినతి పత్రం అందిస్తున్న చందంపేట గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు డిప్యుటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని పాఠశాల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈఓ పుష్పవేణికి గురువారం వినతి పత్రం అందించారు. బడిబాటలో నాణ్యమై విద్యను అందిస్తామని మాటిచ్చి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామని, తీరా పాఠశాల ఉపాధ్యాయురాలిని డిప్యుటేషన్ వేస్తే ఎలా అని ప్రశ్నించారు. తమ పాఠశాల నుంచి డిప్యుటేషన్ వేసిన ఉపాధ్యాయురాలిని చందంపేట ప్రాథమిక పాఠశాలలోనే పనిచేసేలా ఆదేశాలివ్వాలని కోరారు.

తల్లి పాల ప్రాముఖ్యతను వివరించాలి

నర్సాపూర్: అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 1నుంచి 7వ తేదీవరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ హేమా భార్గవి పేర్కొన్నారు. నర్సాపూర్‌తోపాటు ప్రాజెక్టు పరిధిలోని పలు సెక్టార్ స్థాయి సమావేశాల్లో గురువారం ఆమె పాల్గొని అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. వారం రోజుల పాటు చేపట్టే తల్లి పాలవారోత్సవాల్లో తల్లిపాలు పట్ల గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు.



అంగన్‌వాడీ టీచర్లకు వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ హేమాభార్గవి

సూచనలు పాటిస్తే అధిక లాభాలు

ఏఓ జావీద్



పత్తి పంట పరిశీలిస్తున్న ఏఓ జావీద్

రేగోడ్(మెదక్): వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని స్థానిక ఏఓ జావీద్ తెలిపారు. మండలంలోని జగిర్యాల గ్రామ శివారులో గురువారం పత్తి పంట పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నత్రజని ఎరువులను సరైన మోతాదులో, సకాలంలో వేయాలని, లేకపోతే చీడపీడల ఉధృతి ఎక్కువవుతుందన్నారు. పత్తిలో అంతర పంటలుగా పెసర, మినుము, సోయాచిక్కుడు, అలసంద వంటి పంటలను సాగు చేయటం ద్వారా మిత్ర పురుగులు బాగా వృద్ధి చెంది కొంతవరకు రసం పీల్చు పురుగుల నియంత్రణకు దోహదపడుతాయన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు తొలిదశలో విచ్చల విడిగా రసాయన మందులను పిచికారీ చేయకూడదని సూచించారు. తెల్లదోమ నివారణకు మందుల పిచికారీతోపాటు మార్కెట్లో లభించే పసుపురంగు జిగురు పూసిన అట్టలను(ఎల్లోస్టికి ట్రాప్స్) ఎకరానికి 10 చొప్పున అమరిస్తే వాటి జిగురుకు అంటుకొని చనిపోతాయని చెప్పారు.

అందరూ కలిసిమెలిసి ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని తహసీల్దార్ కమలాద్రి అన్నారు. గురువారం మండల పరిధి బిజ్లిపూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. రెండు గ్లాసుల పద్ధతి, కులవివక్ష చూపొద్దన్నారు. విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ భారతి, ఆర్ఐ కిషన్ ఉన్నారు.

సాగులో జాగ్రత్తలు పాటించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు పంటలసాగులో జాగ్రత్తలు పాటించాలని మల్లారెడ్డి అగ్రికల్చర్ యునివర్సిటీ విద్యార్థులు సూచించారు. రావే(రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్సపీరియన్స్ ప్రోగ్రాం)లో భాగంగా మండలంలోని తునికి కేవీకేకు హైదరాబాద్ మల్లారెడ్డి అగ్రికల్చర్ యునివర్సిటీ వచ్చారు. కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తునికిలో రైతులకు వరిపంటలో యాజమాన్య పద్ధతులను వివరించారు. నాట్లు వేసేముందు కొనలను తుంచి వేయాలన్నారు. నాటు వేసిన తరువాత ఇరవై రోజులలోపు పంటను మొగిపురుగు ఆశించే ఆస్కారం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటమార్పిడి, నాణ్యమైన విత్తనాల ఎంపికతో చీడపీడలను నివారించవచ్చని సూచించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడవద్దని చెప్పారు. కార్యక్రమంలో యునివర్సిటీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

జ్వరాల బారిన దాసరి కాలనీ వాసులు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో ఉన్న దాసరి కాలనీ వాసులు నాలుగైదు రోజులుగా జ్వరాలతో అస్వస్థతకు గురయ్యారు. తమ ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరిగాయి. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ పట్టించుకోవడం లేదని, మురుగు కాలువలు సైతం శుభ్రపర్చడంలేదని కాలనీ వాసులు వాపోయారు.ఇకనైనా వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపండి

ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

మెదక్ మున్సిపాలిటీ: ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలసి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్సై మహ్మద్ గౌస్‌ను మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా గౌస్‌కు పోలీసు సిబ్బంది కరతాళ ధ్వనులతో అభినందనలు తెలియజేసి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, జిల్లా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డులతోనే పథకాలు

చేగుంట(తూప్రాన్): రైతు గుర్తింపు కార్డులు ఉంటేనే కేంద్ర ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలు అర్హులని ఏఈఓ మాధవి పేర్కొన్నారు. చేగుంట రైతు వేదిక పరిధిలోని గ్రామాల రైతులు త్వరగా రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. మండల కేంద్రమైన చేగుంట రైతు వేదికలో గురువారం ఆమె ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా వజాహత్

మెదక్ మున్సిపాలిటీ: తెలంగాణ అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్ట్ నయీమ్ వజాహత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం మెదక్‌కు చెందిన ఉర్దూ జర్నలిస్టులు మహమ్మద్ రియాజుద్దీన్, సయ్యద్ సఫ్దర్ అలీ, ఇంతియాజుద్దీన్ హైదరాబాద్‌లో ఆయనను కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సియాసత్ టీవీ ఇన్‌చార్జి రియాజ్ అహ్మద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి సీతారంతండాలో గురువారం తీజ్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులగా పూజలు నిర్వహించి ఆఖరి రోజు గురువారం మొలకెత్తిన ధాన్యంతో ఆటపాటలతో ఊరేగింపు చేపట్టి స్థానిక చెరువులో నిమజ్జనోత్సవం చేశారు. నిమజ్జనోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటతో సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆమె వెంట నాయకులు రమణగౌడ్, హరికృష్ణ, మహేశ్‌గుప్తా ఉన్నారు.

ఏపీఎంగా గౌరీశంకర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండల ఐకేపీ ఏపీఎంగా గౌరీశంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నర్సాపూర్ ఐకేపీలో విధులు నిర్వహించానని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇంతకు ముందు ఏపీఎంగా విధులు నిర్వహించిన ప్రేమలత సంగారెడ్డికి బదిలీ అయ్యారు.

తహసీల్దార్ సేవలు అభినందనీయం

కలెక్టర్ రాహుల్‌రాజ్



తహసీల్దార్ కరీంను సన్మానిస్తున్న కలెక్టర్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి మెలిసి పనిచేసిన నార్సింగి తహసీల్దార్ షేక్ కరీం నిజాయితీతో మంచి గుర్తింపు పొందారని కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. గురువారం తహసీల్దార్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విధుల్లో అంకితభావంతో పనిచేశారని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉన్నారని ప్రశంసించారు. మంచి అధికారిని ప్రజలు ఎల్లవేళలా గుర్తించుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, పలు మండలాల తహసీల్దార్లు, మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశంగౌడ్, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు బాబు, మాజీ సర్పంచ్ షేక్ షరీఫ్, బీజేపీ నాయకులు లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

అల్లాదుర్గం(మెదక్): ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అయినా, వారు చేసిన సేవలు ప్రజల్లో చిరస్థాయిగా ఉంటాయని పాపన్నపేట విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్ అన్నారు. ఎలక్ట్రిసిటీ ఉద్యోగి రమేశ్ పదవి విరమణ పొందగా గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తే ప్రజలలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈలు నవాజ్, యాసిన్, శంకర్, టీఆర్‌వీకేఎస్ మెదక్ కార్యదర్శి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రమేశ్‌ను సన్మానిస్తున్న ఏడీఈ తదితరులు

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి



పాంపల్లిలో ఐసీడీఎస్ సెక్టార్ సమావేశం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మి

కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఐసీడీఎస్ రాయిలాపూర్ సెక్టర్ సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు. మండలంలోని పాంపల్లిలో అంగన్‌వాడీ టీచర్లతో గురువారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఈనెల 1నుంచి 7వ తేదీవరకు జరిగే తల్లిపాల వారోత్సవాలను ప్రతీ అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించాలన్నారు. తల్లిపాలు, ముర్రుపాల ప్రాముఖ్యతను వివరించాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని తెలిపారు. పిల్లలకు ఆట పాటలద్వారా విద్యాబోధన చేయాలని గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సమావేశంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నూతన నియామకం

మెదక్‌జోన్: హనుమాన్ సుతారి సంఘం పట్టణ అధ్యక్షుడిగా నాయికోటి శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం బాధ్యులు తెలిపారు. గురువారం మెదక్ పట్టణంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నె కిషన్ ఆధ్వర్యంలో సుతారి సంఘం ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు. ఇందులో పట్టణ గౌరవ అధ్యక్షుడిగా పడమటి రాందేవ్, ఉపాధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా లింగంతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైనా పట్టణ అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ.. సుతారీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి మీకు లేదు

బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గురువారం విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డుల పంపిణీ సమయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం కలసి చేద్దాం అన్న ఎమ్మెల్యే మాటలను వారు జీర్ణించుకోలేక పోయారన్నారు. అనంతరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారన్నారు. ఓ కలెక్టర్ అధికార ప్రతినిధిలా కాకండా, పార్టీ ప్రతినిధిలా మాట్లాడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, యూత్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, ముకుందరెడ్డి, యాదగిరి, శంకర్ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు షఫీ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతితో సాగు చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): సేంద్రియ విధానంతో పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని సెహగల్ ఫౌండేషన్ వ్యవసాయ నిపుణుడు మనిదీప్ పేర్కొన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసార పరీక్షలకు అనుగుణంగా అవసరమైన సేంద్రియ ఎరువులను వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి.. సేంద్రియ ఎరువులు, హరిత ఎరువులు, ఎండునూనె సాగు, పురుగుల నియంత్రణ విధానాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శేఖర్, గ్రామ కార్యదర్శి ప్రతిభ, సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు గౌతమ్, విక్రాంత్, కావ్యరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ నిపుణుడు మనిదీప్